అపూర్వ

బ్రహ్మచర్య ప్రహసనము.

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము

రాజమహేంద్రవరము

1950

[వెల 0-4-0

శ్రీ కీర్తిశేషులయిన రావుబహద్దూరు

కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములు.

ప్రహసనములు

మొదటి సంపుటము

1 అపూర్వబ్రహ్మచర్య
2 విచిత్రవివాహము
3 మహాబధిర
4 పునర్మరణము
5 బలత్కారగానవినోదం
6 కలహప్రియా
7 మహామహోపాధ్యాయ
8 యోగనిద్రా
9 మహావంచక
10 అసహాయశూర
11 కలిపురుషశనైశ్చరవిలాసము
12 వేశ్యాప్రియా
13 కౌతుకవర్ధని
14 వినోదతరంగిణి
15 హాస్యసంజీవిని మొదటిభాగం
16 ,, రెండవభాగం
17 ,, మూడవభాగం

నాటకములు

రెండవ సంపుటము

1 బ్రాహ్మవివాహము
2 వ్యవహారధర్మబోధిని
3 తిర్యగ్విద్వన్మహాసభ & మూషకాసుర విజయం
4 మహారణ్యపురాధిపత్యము
5 ప్రహ్లాద
6 సత్యహరిశ్చంద్ర
7 దక్షిణగోగ్రహణము
8 వివేకదీపిక

భాషాంతరీకృతనాటకములు

మూడవ సంపుటము

1 చమత్కార రత్నావళి
2 రాగమంజరి
3 కల్యాణకల్పవల్లి
4 అభిజ్ఞాన శాకుంతలము
5 రత్నావళి
6 మాలవికాగ్నిమిత్రము
7 ప్రబోధచంద్రోదయము
8 వెనీసువర్తక చరిత్రము

వచనప్రబంధములు

పద్యకావ్యములు

నాల్గవ సంపుటము

1 సత్యరాజాపూర్వదేశ యాత్రలు (1, 2 భాగములు)
2 రాజశేఖర చరిత్రము
3 శుద్ధాంధ్రనిరోష్ఠ్యనిర్వచన నైషధము
4 రసికజనమనోరంజనము
5 శుద్ధాంధ్రభారత సంగ్రహము
6 అభాగ్యోపాఖ్యానము
7 పథికవిలాసము
8 జాన్ గిల్పిన్
9 నీతిదీపిక

I

అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము.

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

మూడవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీసమాజము
రాజమహేంద్రవరము.

1950

 [వెల 0-4-0

II

అపూర్వబ్రహ్మచర్యప్రహసనము

ఇందువచ్చు పాత్రములు

రామాకాంతము పంతులు—కథానాయకుఁడు.

కరటకరెడ్డి—పంతులవారి సేవకుఁడు.

వెంకఁడు—తోఁటపనివాఁడు.

సోమభట్టు—పురోహితుఁడు.

శ్యామలాంబ—రామాకాంతము పంతులభార్య.

మోహిని—కరటకరెడ్డి భార్య.

రంగము—రాజమహేంద్రవరము రామాకాంతము పంతులుగారి
గృహము

[సేవకుఁడు కరటకరెడ్డి ప్రవేశించుచున్నాఁడు]

కర—ఇక్కడికి రెండు సంవత్సరాలనుంచి నాభార్యను నా యజమానుడి కంటపడకుండా కాపాడుకొనివచ్చినాను. అతనికంట బడితే యికనాకు భార్యఆశ లేదు. యిదివరకూ నాయజమానుఁడు నేను బ్రహ్మచారిననే భ్రమతో నేవున్నాడు. యీప్రకారంగానే యింకా మోసంచేస్తూ నాబుద్ధిబలంచేత యీభ్రమ యెల్లకాలమూ వుండేటట్టు చేస్తాను. నాకు పెళ్లామువున్నట్టు పంతులుగారికి తెలిసి వున్నట్టయితే యిదివరకే నాకొంప మునిగేది. పెళ్ళాలువున్న యీ వీధివాళ్ళంతా ఆయనజీవానికి వుసూరుమని యేడుస్తూవున్నారు. ఆయన మ్యూనిసిపల్ కమిషనరూ లోకల్ ఫండు మెంబరూ బెంచి మేజస్ట్రీటూ డిస్ట్రిక్టుకోర్టు ప్లీడరూ కావడంచేత యెప్పుడు యేమి చేసిపోతాడో అని అందరూ జడుస్తూవుంటారు. వాసుదేవరావు పంతులుగారిభార్య పుట్టింటికి వెళ్ళబోతూవుండడంచేత ఆవిడనిమిత్త

మాపంతులుగారు యీవాళ స్టీమరుదాటి కొవ్వూరు వెళుతారు. అమ్మగారు పుట్టింటికి వెళ్ళినారు. ఈవేళ నేను నాభార్యను యిక్కడకు దీసుకునివచ్చి అమ్మగారి పడకగదిలో నేనుయీరాత్రిఅంతా ఖులాసాగా వుంటాను; అవతలినుంచి యెవరో వస్తూవున్నట్టున్నారు.

[రామాకాంతము పంతులుగారు ప్రవేశించుచున్నారు]

రామా—కరటకా! కరటకా! వాసుదేవరావు పెళ్ళాము స్టీమరుమీదికి వెళ్ళిందా?

కర—ఇప్పుడే వెళ్ళింది. మీరు వెంటనే వెళ్లితే స్టీమరు అందుతుంది. మీరు వేగిరం బయలుదేరవలెను. (తనలో) నేను యీరాత్రి యీయనను యెలాగయినా పంపించివెయ్యవలెను.

రామా—నన్నుకూడా వెళ్ళమన్నావా? మీఅమ్మగారుకూడా వూళ్లోలేదు. ఇల్లునీవు చూస్తూవుంటావా?

కర—అవశ్యంగా వెళ్ళండి. నేను బ్రహ్మచారిని. పెళ్లాము వద్దకుపోవలసిన పనిలేదు. నేనీరాత్రి యిక్కడనే పరుండి మీయిల్లూ వస్తువులూ మీకుపదిలంగా వప్పగిస్తాను.

రామా—ఈలోగా వూరినుంచి మీఅమ్మగారు రాదుగదా? మగవాణ్ని కావడంచేత నేనుదాన్ని వదలిపెట్టివుండగలిగినా, అది పనికిమాలిన ఆడది కావడంచేత పట్టుమని పదిరోజులయినా పుట్టింటికాడ నన్ను వదలిపెట్టి వుండలేదు. నేనువర్తమానం పంపించకుండానే బండి చేసుకుని దుడుంగున వస్తూవుంటుంది. పుట్టిల్లు దగ్గిర వూరు కావడంచేత యీఅసందర్భం వస్తూవుంటుంది.

కర—ఆవిషయంలో మీరేమీ భయపడనక్కరలేదు. అమ్మగారు యీరోజురారు. వకవేళవచ్చినా నేను సర్ది చెప్పి మీరు కొవ్వూరు తగాదాలో స్థలంచూడడం నిమిత్తం వెళ్ళినారని చెపుతాను. స్టీమరు మించిపోతుంది. మీరుత్వరగా వెళ్ళవలెను.

రామా — నేను వేగిరం వెళ్ళవలెనని నీకు బహుతొందరగా వున్నది. యెందుచేత?

కర — నాకుయేమీ తొందర లేదు. కావలిస్తే వెయ్యేళ్ళు యింట్లోనేవుండండి. వకరోజయినా వూరు దాటిపోతే చాలునని సంతోషించడానికి నాకు పెళ్ళామయినా వున్నదా యేమిటి?

రామా — ఆహాహాహా. పెళ్ళాలువున్న వాళ్ళందరికీ నేను వెళ్ళిపోవలెనని వుంటుందేమి? నేను యిప్పుడు వ్యభిచారంమానివేసి పెద్దమనిషి నవుతూవున్నాను. మీదటినుంచి బొత్తిగా మానివేస్తాను. నేను వాసుదేవరావు పెళ్ళాము జానికమ్మనువిడిచి వక్కనిముషం తాళలేను. ఆవిడె కేవలమూ జానకీదేవే. నాపాలిటికి శ్రీమహాలక్ష్మి. నీమాట తీసివెయ్యరాదు. నేనుకూడా ఆస్టీమరులోనే వెళుతాను. నేను వెళుతూవున్నాను. ఇల్లు పదిలము. మీఅమ్మగారు తానువచ్చేలోగా మంచిదాసీని కుదుర్చుమని చెప్పిపోయింది. ఆమాటమరచిపోకు. ఇవిగో యింటితాళము చెవులు. రేపు ఆదివారంగనుక నేను రావడం రెండురోజులు ఆలస్యమయినా యీలోపుగా అమ్మగారు ధవిళేశ్వరంనుంచివస్తే తాళంచెవులియ్యి. (అని వెళ్ళుచున్నాఁడు)

కర — ఈయనను వదల్చుకున్నాను. ఇక నాపెళ్ళాం యిక్కడకు స్వేచ్ఛగా రావచ్చును. వచ్చేటప్పుడుమాత్రం నాపెళ్ళాము దోవలో యీయనకంట పడకుండా రావలెను. ఆలావస్తే ఈరాత్రి మాప్రభువుగారి పడకగదిలో పందిరి పట్టెమంచంమీద మా మోహినీ నేనూ రాజదంపతులలాగు వుంటాము. అదుగో మోహిని వస్తూవున్నది.

[అప్పుడు మోహిని ప్రవేశించుచున్నది.]

మోహి — కరటకరెడ్డీ! నీయజమానుఁడు వూరికివెళ్ళినాఁడా?

కర — నీ పుణ్యంచేత యిప్పుడే వెళ్ళినాఁడు. నీకు వీధిలో ఎదురుపడలేదుగద? నీవు అదృష్టవంతురాలవు. నీకుయీరాత్రి పందిరి పట్టె మంచమూ పరుపూ దొరకుతుంది. నీవు మన వివాహంమాట మాత్రము యెవరితోనూ చెప్పకుమా.

మోహి — యెవరితోనూ చెప్పను. వక్క నా స్నేహితులు బుచ్చితోనూ అచ్చితోనూమంగితోను — (ఆలోచించి) — ఎంకో యెవరితో చెపుతానా? మా మేనమామ పుల్లిగాడితోకూడా —

కర — సరి యేడిసినట్టేవున్నది నీరహస్యం. డప్పువుచ్చుకొని టమటమా వేసి మాదిగవాడితోకూడా చెప్పు. నాయజమానుడితో నాకు పెళ్ళికాలేదని చెపుతూవున్నానుగదా! నాగుట్టు ఆయనకు తెలిస్తే!

మోహి — ఎవరితోనూ చెప్పవద్దని వాళ్ళచేత చేతిలోచెయ్యి వేయించుకుంటానులే.

కర — నీ రహస్యం నీవుదాచుకోలేవుగాని యిఖ యితరులు దాస్తారా? యెలాగా నా యజమానుడికి తెలియకమానదు. ఆడదాని వద్ద రహస్యం దాగదని పెద్దలుచెప్పినమాట వూరికేపోతుందీ?

మోహి — అవును. నావద్ద రహస్యందాగదు. రహస్యం దాగవలెనంటే నీవు నాకు తెలియకుండానే పెళ్ళి చేసుకోలేక పోయినావా?

కర — సరిసరి యిది మరీచిత్రముగావున్నది. నీకు తెలియకుండానే నిన్ను నేను పెళ్ళిచేసుకోవలసినది కాదూ? ఇటువంటి దేవ రహస్యాలు నా యజమానుడికేకాని నాకు తెలియవు.

మోహి — మనరహస్యం నీ యజమానుడికి తెలిస్తేమాత్రం మనకు వచ్చిన భయం యేమిటి? నన్నుచూచి అతఁడు సంతోషిస్తాడో లేదో వక్కపర్యాయం తీసుకునివెళ్లి చూపు. తాను

పెళ్లిఆడి సుఖపడుతూవున్నప్పుడు నవుకర్లు పెళ్లి ఆడితేమాత్రం యెందుకు కోపంవుంటుంది?

కర—నిన్నుచూస్తే అతడు తప్పకుండా సంతోషిస్తాడు. అతడికి పెళ్ళిమాత్రమే యిష్టంలేదుగాని నీవంటి పడుచు పెళ్ళి కూతుళ్ళంటే చాలాయిష్టమే.

మోహి—అలాగయితే యింకా యెన్నాళ్ళు నేను యీ రహస్యం దాచవలెను.

కర—యెన్నాళ్ళో అక్కరలేదు. నేను ఈయనదగ్గిర నవుకరీ వదులుకున్నదాకా దాస్తేచాలును. నాకిప్పుడు ముప్ఫయియేళ్ళు వున్నవి. ముసలవాణ్ని అయినతరువాత నేను నవుకరీ తక్షణం మానుకుంటాను. నేను నవుకరీ మానుకున్నదాకా దాచలేకపోతే నాయజమానుడు ముసలవాడయినదాకానయినా దాచు. అంతే చాలును. అతఁడు నాకంటె నాలుగేళ్ళుమాత్రం చిన్నవాఁడు. నీవలాచేస్తే నాకు యితఁడు డబ్బు చాలా యిస్తాడుగనుక నేను యెప్పుడూ నవుకరీవదులుకోకుండా సుఖంగా వుంటాను.

మోహి—నీవు నవుకరీ వదులుకున్నదాకానే రహస్యం దాచుతానుగాని అతఁడు ముసలివాడైనదాకా నేను దాచలేను. ఈలోగా యేలాగయినా కష్టపడుతానుగాని నాకోసం నీవు రేపు వుదయాన్నుంచీ తప్పకుండా నవుకరీ మానుకుందూ.

కర—నవుకరీ మానుకుంటే నీకు నగలూ బువ్వా యెక్కడ నుంచి వస్తుంది?

మోహి—అలాగయితే నీవు డబ్బుబాగా సంపాదించి పరుపులూ పంట్టెమంచాలూ చేయించి నాకు నవుకర్లనూ పెట్టి బండిలో యెక్కించి నన్ను వూరంతా తిప్పి సుఖపెడుతావా?

కర—అవన్నీ యీ రాత్రే చేస్తాను. ఈరాత్రి మనం అమ్మ గారి గదిలో పరుపులమీదను పట్టెమంచాలమీదనూ పరుండాము; చీకటిపడ్డతరువాత పంతులుగారిబండిలో యెక్కించి నిన్ను పెద్దవీధి గుండా తిప్పతాను; తోటమాలీ వెంకడిచేత నీకు కావలసినన్ని పనులు చేయిస్తాను.

మోహి—అలాగయితే పెళ్లినాడు పెట్టిన మధురచీర కట్టు కుని నిమిషాలలో నేను యింటికి వెళ్ళిమళ్ళీవస్తాను. ఈలోపుగాబండీ అన్నీ సిద్ధముచేయించు.

కర—వెళ్ళి యిక్కడవున్నట్టురా. నీవు వచ్చేటప్పటికి ఫల హారానికి మిఠాయికూడా తెప్పించివుంచుతాను. మనంఫలహారంచేసి చల్లపాటువేళ చల్లగాలిలో హాయిగా షికారుబయలు దేరుదాము.

మోహి—మంచిగంధమూ మల్లెపూవ్వులూకూడా తెప్పించ వలెనుసుమా.

(అని పోవుచున్నది.)

కర—ఓరీ! వెంకా! తోటపని మానివేసి యిలారా.

వెంక—(ప్రవేశించి) బాబూ! యెందుకండీ?

కర—పంతులుగారు వూరికి వెళ్ళేటప్పుడు నీవు తోటపని మానివేసి ఈరోజల్లా నావర్దలోవుండి నేను చెప్పినపనల్లా చేయు మన్నారు. విన్నావా? నేను చెప్పినపని చెయ్యకపోతే నీకు నవుకరీ వుండదుసుమా. నీవు పెందరాళే భోంచేసివచ్చి రాత్రి నేనూ నాభార్యా పడుకున్నప్పుడు నీవుమాకు పంఖావిసరవలెను. బండి వానితో చెప్పి సాయంకాలము షికారువెళ్ళడానికి బండికట్టించి తయారుగా వుంపించు. నీవు ముందుగాపోయి నేను యిమ్మన్నానని పంతులుగారికి వాడుకగా మిఠాయి యిచ్చే కిసిన్‌సింగువద్ద యేబులం పంచదారమిఠాయి రెండుపొట్లాలు కట్టించుకునిరా.

వెంక—అలాగే చేస్తానుకానండి నీళ్ళులేక పువ్వులచెట్లు చచ్చిపోయినవని రేపు పంతులుగారు కోపపడితేనో—

కర—నాదగ్గిర యెదురుమాటచెప్పక చెప్పినట్టుచెయ్యి. నీకు కొత్తగనుక యింకా తెలియలేదుగాని నాఆజ్ఞఅంటే పంతులుగారి ఆజ్ఞకంటేనూ యెక్కువ. పంతులుగారికి కోపమువచ్చినా నీవు పనిచెయ్యగలవుగాని నాకు కోపంవస్తే వక్కనిమిషం పనిచెయ్య లేవు. పంతులుగారు నిన్ను అంతగా అడిగితే నేను పనిమీద పంపించినానని చెప్పు.

వెం—చిత్రము. చిత్రము.

కర—ముందుగాపోయి మిఠాయి తీసుకునిరా. పో.

వెంక—పణసతొనల మిఠాయా! (అని వెళ్ళుచున్నాడు)

కర—నేను యీవాళ నాయజమానుడికంటెనూ యెక్కువగా వుంటాను. ఈపాటి మోహిని వస్తూవుంటుంది. యెవరో వస్తూవున్నట్లు అడుగుల చప్పుడవుతూ వున్నది. అది మోహినే అయివుండును. కాదు బూట్సు చప్పుడులాగువున్నది. అదియేమి నాయజమానుడు మళ్ళీ వస్తూవున్నాడు! అయ్యో! దైవమా! ఏమి యీ దురదృష్టము! ఇప్పుడు మోహినివచ్చి యితనికంటపడితే నా కాపురం కూలిపోయిందే. ఇక నేను సంసారానికి నీళ్లువదులుకోవలెను. నేను యేదోపని కల్పించుకొని వీధిలోకి వెళ్ళి నా పెళ్ళామును రావద్దని చెప్పివస్తాను. ఈలోపుగా మిఠాయి పట్టుకొని వెంకడు రాడుగదా?

[అప్పుడు రామాకాంతము పంతులు ప్రవేశించుచున్నాడు]

రామా—కరటకా!

కర—(ఎవ్వరయిన వచ్చుచున్నారేమోయని గుమ్మంవంక చూచుచు) అయ్యా! ఏమి! మీరు వెళ్ళినారుకారేమి?

రామా—నేను స్టీమరువద్దకు వెళ్ళేటప్పటికి వక్కతమాషా జరిగింది. టిక్కెట్టు పుచ్చుకొని, ఆతమాషాచూచి మళ్ళీవత్తామని యిల్లేలవతలికి వెళ్ళేటప్పటికి స్టీమరువాళ్లు స్టీమరు తీసుకుని చక్కాపోయినారు. రివిన్యూ వుద్యోగస్థులకోసం కనిపెట్టుకునివుంటూ నానిమిత్తం యెందుకు కనిపెట్టుకొని వున్నారుకారో వాళ్ళపని నేను రేవుపట్టిస్తాను. రెడ్డీ! ఆతమాషాయేమో నీవువూహించఁగలవా?

కర—నాకు ఆమాత్రం బుద్ధిలేదు. అయినా కానీ మీకు యెవర్తో చక్కనిపడుచు చిన్నది కనపడ్డ దనుకుంటాను.

రామా—నీవు చక్కగా కనిపెట్టినావు. నీకుజ్యోతిషంకూడా తెలిసినట్లున్న దే? నీవు మాసిద్ధాంతిగారికంటెను దాఖలాగా చెప్పినావు. నీవెక్కడ బుద్ధిహీనుఁడవు? నీవు బుద్ధికి బృహస్పతివి.

కర—ఇదంతా మీదయ.

రామా—నాకు మూడురోజులకింద రతీదేవివంటి వొక్క చక్కనిచిన్నది నేనూ నాస్నేహితుఁడూ కలిసివస్తావుండగా కనపడ్డది. ఆచిన్న దే స్టీమరుమీదికి యెక్కబోతూ వుండగా కనపడ్డది. ఆచిన్నదే స్టీమరుమీదికి యెక్కబోతూ వుండగా దూరంగా మళ్ళీ కనపడ్డది. నేను రేవులోనుంచి వీధి మొగకు వచ్చేటప్పటికి యేయింట్లోకిపోయిందో మళ్ళీకనపడ్డదికాదు. వీధంతా యీచివరినుంచి ఆచివరకు నాలుగుమాట్లు తిరిగి యెక్కడా కనపడక ఇంతలో స్టీమరుకూడా దాటిపోయినందున తిరిగి యింటికివచ్చినాను.

కర—(తనలో) ఇతనికేదో గొప్పయెరదొరికింది. అందుచేత యితణ్ని మళ్ళీ పంపించివేసి యీరాత్రి నేను భార్యతో సుఖంగా వుండవచ్చును. ఇతణ్ని మాయచేసి యెక్కడా పడుచులులేని యింటియెదుట వీధిఅరుగుమీద తెల్లవారిందాకా కూర్చోపెట్టివస్తాను. (ప్రకాశముగా) మీకుకనపడ్డచిన్నది యెట్టిని పలచని చిన్నదికాదు గదా!

రామా—అవును మెట్టినిచిన్నదే. ఇంకాయేదయినా ఆనవాలుచెప్పు.

కర—అట్టేపొట్టికాకుండా పొడుగూకాకుండా వుంటుంది.

రామా—అవును ఆలాగేవుంటుంది. మరివకగుఱుతు చెప్పు.

కర—తలవెంట్రుకలు నల్లగావుంటవి కొప్పు పెడుతుంది.

రామా—అందరూ కొప్పుపెడుతారు; అందరి తలవెంట్రుకలూనల్లగానేవుంటవి. ఇదేంఆనవాలు?

కర—ఆలాగైతే యెవరికీలేని మంచి ఆనవాలు యింకొకటి చెపుతానువినండి. ఆచిన్నది కుంకుమబొట్టు పెడుతుందికాదూ? కళ్ళకి కాటుక పెడుతుంది.

రామా—ఈరెండు పనులూ అందరూచేస్తారు.

కర—అందరూయెందుకు చేస్తారు? మాఅన్నగారి పెళ్ళాం చెయ్యదు. ఆవిడ యెప్పుడూ బొట్టుపెట్టుకోదు; కాటుకపెట్టుకోదు. కొప్పుపెట్టుకోదు. గాజులుపెట్టుకోదు.

రామా—మీఅన్నపెళ్ళాం వెధవచిన్నది కాబోలును.

కర—అవును. వెధవచిన్నదే కాబోలును. మీరన్నది యే అన్నపెళ్ళామూ? ఇప్పుడు మీమేనమామగారియింట్లో పనిలోవున్న అన్నగారిపెళ్ళాముకాదూ? ఆవిడవెధవే. ఆవిడను మొగుడు కోపమువచ్చినప్పుడు యెప్పుడూవెధవా వెధవా అంటూవుంటాడు. నిఱుడుమరిడీజాడ్యాలలో చచ్చిన అన్నగారిపెళ్ళాం వక్కత్తేమాత్రం విధవకాదు.

రామా—మీఅన్నగారు బ్రతికివుండగా పెళ్ళాం వెధవ యెలాగయిందోయి?

కర—నన్నువూరికే ప్రశ్నలువేసి భ్రమపెట్టకండి. మీరు యాభయిప్రశ్నలువేసినా నేను అబద్ధంఆడను. మహారాజులాగు

యింట్లోకూర్చునేవారికి మీకు లోకంసంగతి యేమితెలుస్తుంది? లోకంలో దేవరరహస్యాలుయెన్నోవుంటవి. యెరిగినవాణ్ని నామాట నమ్మండి. మొగుడు బ్రతికివుండగానే కొందరు పెళ్ళాలు వెధవలూ అవుతారు; పెళ్ళిఅయినతరువాతకొందరు గృహస్థులు బ్రహచారులూ అవుతారు. ఇవన్నీ ఇప్పుడెందుకుగాని మీరుచూచినది పొన్నమండ భీమన్నకూతురు. దాని మొగుడు ముసలివాఁడు.

రామా—ఆచిన్నదాని సంగతంతా నీవిదివరకే యెరుగుదువా?

కర—ఒక్కయెరగడమేకాదు. రేపుతెల్లవారేలోగా ఆచిన్నదాన్ని మీసొమ్మేచేసివేస్తాను. మీరు యిప్పుడే బయలుదేరి వారి యింటికి యెదురుగుండావున్న అరుగుమీద ఈరాత్రంతా పరుండవలెను. తెల్లవారేలోగా మీకాచిన్నదాన్ని తీసుకునివచ్చి మీకన్నుల పండుగచేస్తాను. మీకు తెలియకుండా మీవద్దకు తీసుకురావడానికై మీనిమిత్తం నేను ప్రయత్నంచేస్తూవున్నదే ఆచిన్నది.

రామా—అలాగా? నీవు బహుబుద్ధిమంతుఁడవు. నీఋణం నేను వుంచుకోను. ఆచిన్నదాన్ని నాకుదక్కించితివా, నీకు యిరువయిరూపాయిలు బహుమానంచేస్తాను. నేను యెప్పుడూ చేసిన మేలు మరచిపోనుసుమా.

[అప్పుడకస్మాత్తుగా మగనివెనుకవైపునుండి మోహిని లోపలికి వచ్చుచున్నది.]

కర—ఆయిరవై రూపాయిలూ నాచేతిలోపడ్డవే. పాపం దానిమొగుడు అదృష్టహీనుఁడు.

రామా—(మోహినినిచూచి) ఏమి యీభాగ్యము! కరటకా! ఇవిగో నీరూపాయిలుపుచ్చుకో. (అనిచేతిలోపెట్టుచున్నాఁడు.)

కర—ఏమియీభాగ్యము! నాకుముందుగానే రూపాయిలు యిస్తూవున్నారు! (అని వెనుకతిరిగి మోహినిని చూచుచున్నాఁడు.)

మోహి—(తెల్లపోయి నిలుచున్నది.)

రామా—ఆచిన్నదాన్ని మాటలోనే యిక్కడికితలవని తలంపుగారప్పించినావు! ఈ మెకు వెయ్యేళ్ళు ఆయుస్సున్నది.

కర—(తనలో) అయ్యో! నాకొంపమునిగింది.

మోహి—కరటకా! నన్నుక్షమించు. నేను అసమయంలో వచ్చినాను.

రామా—అసమయంకాదు మంచిసమయయంలోనే వచ్చినావు. నాభార్యవూళ్ళోలేదు, ఈరెడ్డి నిన్నుగమ్మన్నది నానిమిత్తమే

కర—(మోహినితో రహస్యముగా) ఇతఁడేనాయజమానుఁడైన రామాకాంతముపంతులు. మనరహస్యంజాగ్రత.

రామా—సుందరీ! నీపేరెవరు?

మోహి—నాపేరు మోహిని. నేను మీపాదసేవకురాలను.

కర—(రహస్యముగా) ఇతనికి పాదసేవకురాలవా? నీవు అలా అనబోకు.

మోహి—నేను నిజముగా సేవకురాలనుకాను. గోదావరి యొడ్డున కాపురమున్న ముసలిగంగమ్మ కూతురిని.

రామా—ముసలిగంగమ్మకూతురవా? పాపము! మొగుడు పోయినప్పటినుంచీ జీవనానికి జరగక గంగమ్మ చాలాయిబ్బంది పడుతూవున్నట్టున్నది. మీరు నిర్విచారంగా వుండండి. మీయిద్దరినీ నేనేపోషిస్తాను. నీవు మాపిల్లవాళ్ళను యెత్తుకుంటూ వుంటూవుగాని నీతల్లి నీతోవుంటుంది. మీరు రేపువచ్చి మాతోటయింట్లో దిగండి కరటకా! నీవు వీరి సంరక్షణ కనుక్కుంటూవుండవలెను.

కర—(లేచి మోహినికిని రామాకాంతము పంతులకును నడుమవచ్చి మోహినిని పొమ్మని సైగచేయుచు) మీకు పిల్లలు లేనిదీ యేపిల్లల నెత్తుకొంటుంది?

రామా—(కరటకశెడ్డిని వెనుకకుతోయుచు) ఆపనికాకపోతే మరివకపనిచెప్తాను. ఈచిన్నది నేటినుంచీ పనిలోవున్నట్టే.

కర—(పని యొప్పుకోవద్దని వెనుకనుండి సైగచేయుచున్నాడు.)

మోహి—సాకుపనివద్దు.

రామా—నీయిష్టమైనపని చెయ్యవచ్చును. నీకేపని చేతనవునో చెప్పు.

మోహి—నాకేపనీ చేతకాదు.

రామా—ఏపనీచేతకాకతోతే, తోటమాలీ పువ్వులచెట్లకు నీళ్ళుపోస్తూవున్నాడో లేదో చూస్తూవుండువుగానిలే. మీరు రేపు వచ్చి మాయింట్లోప్రవేశించండి. కరటకా! నీవు యీరాత్రే మన తోటయిల్లు ఖాళీచేయించు.

మోహి—మాయింటికి భోజనానికి వెళ్ళవలెను. నన్ను పోనియ్యండి.

రామా—నీకు తినడానికి పంచదార మిఠాయి తెప్పిస్తాను. వక్కనిముషంవుండు. మనము యిద్దరమూ తిందాము. కరటకా! నీవు పరుగెత్తుకొనివెళ్ళి వకవీసెడు పంచదార మిఠాయి పట్టుకునిరా.

మోహి—నేను మాఅమ్మను అడిగిరావలెను.

రామా—నేను నిన్ను బండిలో తీసుకునివెళ్ళి మీాయింటివద్ద దిగబెట్టివస్తానులే. తొందరపడకు. కరటకా! కదలవేమి? వేగిరము మిఠాయీ పళ్ళూ తీసికునిరా.

కర—(తనలో) నాకు చావుగావున్నది. (ప్రకాశముగా) మోహినితల్లియింటివద్దకనిపెట్టుకొని వుంటుంది. కూతురు వేగిరం రాకపోతే యేమి అపాయంజరిగిందో అని ముసలిది యేడిచిపోతుంది ఈచిన్నదాన్ని వేగిరంపంపించి వెయ్యండి.

రామా—అలాగైతే యీచిన్నది సుఖంగా వున్నదని నీవు పరుగెత్తుకొనిపోయి చెప్పిరా.

కర—(తనలో) నాకు మతిపోతూవున్నది. ఇప్పుడేమి చెయ్యడానికీ తోచకుండావున్నది. తొందరపడి యేమయినాచేస్తే నాపనికి నీళ్ళువదులుకోవలెను.

[మిఠాయి పొట్లము పట్టుకొని వెంకడు ప్రవేశించుచున్నాడు]

వెంక—రెడ్డిగారూ! ఇదిగో మిఠాయి తెచ్చినాను.

కర—(తనలో) వీడుకూడా సమయానికే వచ్చినాడు.

రామా—వెంకా! పొట్లము యిలాతీసుకొనిరా. ఇది మాకోసము. అని (పుచ్చుకొనుచున్నాడు) ఓరీ! నీవు వెళ్ళి బండివాణ్ని బండికట్టి సిద్ధముగా వుంచుమని చెప్పు.

వెంక—రెడ్డిగారి సెలవుప్రకారం నేను యిదివరకేచెప్పినానండి. బండివాడు యెడ్లను కడుతూవున్నాడు.

రామా—(కరటకరెడ్డివంక చూచి) ఓరిదొంగా! నీవన్నీ ఇదివరకే యేర్పాటు చేసినావు! అందుచేతనేనా నేనువెళ్ళుమంటే వెళ్ళక యేమీయెఱుగనట్టు నటిస్తూనిలుచున్నావు? ఎప్పుడో జరగబోయేదంతా నీవు ముందుగానే కనిపెట్టి అన్నీ చెప్పకమునుపే జాగ్రతపెడుతూ వున్నావే. అన్నీ సరేకాని తల్లియింటికాడ విచారిస్తూవుండకుండా నీకూతురు భద్రముగావున్నదని నీవు ముందుగాపోయి చెప్పిరావలెను. వేగిరంవెళ్ళు.

కర—ఈ వెంకణ్నిపోయి చెప్పిరమ్మనరాదా?

రామా—ఈపనికి వెంకడు పనికిరాడు. వెంకణ్ని వేరేపనిమీద పంపవలెను. ఇందుకు నీవేతగినవాడవు. నీవుఅబద్ధాలు మహాబాగా చెప్పగలవు. నీశక్తిమతిమెవరికీరాదు. సమయోచితంగా నిమిషంలో కథకల్పించి నమ్మేటట్టుగా నీవు బొంకుతావు. వెంకా! నీవు పళ్ళెములో తమలపాకులువేసి పట్టుకునిరా.

కర—మీరు పూరికేనన్ను స్తుతిచేస్తూవున్నారు. ఈ వెంకడు నాకంటెనూ యెక్కువ అబద్ధాలు ఆడుతాడు. వీణ్ని పంపండి.

రామా—వీడయితే అబద్ధాలాడుతాడుకాని నీకుమల్లె కమ్మే టట్టుగా చెప్పలేడు. నీవు అబద్ధమాడినా నిజంకంటెనూ దివ్యంగా వుంటుంది.

కర—అవునుగానండి—

రామా—అవునూలేదు కాదూలేదు. మీరు యిద్దరూకూడా తక్షణంపొండి. (అని కన్నులెఱ్ఱచేసి కోపపడి కేకలు వేయుచున్నాడు)

వెంక—నేను వెళుతూవున్నాను. (అని పోవుచున్నాడు)

కర—(తనలో) నేను కార్యం చెడకొట్టకపోయినా రెడ్డిని కాను. నీవయితే నేను వెళ్ళిపోతాను. కులకవలెనని సంతోషిస్తూ వున్నావుకాని— (అని వెళ్లుచున్నాడు)

రామా—నీవంటి చక్కనిది భూలోకంలోలేదు.

మోహి—అయ్యో! మీస్తుతికి నేను తగినదాన్ని కాను.

రామా—ప్రియురాలా! నేను చెప్పినది వాస్తవముకాని స్తుతి కాదు. నీబుగ్గలొక్కసారి ముద్దు పెట్టుకోనిస్తావా?

కర—(మరల ప్రవేశించి తొందరచేత చేతిలోని తమల పాకులపళ్లెము క్రిందపడ వేయుచున్నాడు)

రామా—ఓరి నిర్భాగ్యుడా! ఈచిన్నదాన్ని నిష్కారణముగా బెదరకొట్టినావు. పళ్లెము చప్పుడువిని వులికిపడి జడుసుకున్నది.

కర—అయ్యో—మీరుముద్దు—కాదుకాదు—నేనుపళ్ళెము—

రామా—(మిఠాయిపొట్లమువిప్పి, ఉండలు మోహినిచేతిలో పెట్టుచు) మోహినీ! కూరుచో — ఓరినిర్భాగ్యుడా! నిన్నుపోయి మోహినితల్లితో వర్తమానం చెప్పిరమ్మంటే మళ్ళీవచ్చినావేమి? నీవుబుద్ధిపూర్వకంగానే పళ్ళెంపడ వేసినావు.

కర—లేదు లేదు తమలపాకులు మీకు నేనుస్వయంగాతీసుకు రావలెనని వెంకడిని అక్కడకు పంపినాను. మిమ్మలినిచూడఁగానే చెయ్యివడుకెత్తి పళ్ళెంజారి పడిపోయింది.

మోహి—(తనలో) ఈసమయంలో మావాళ్ళు యెవరయినావచ్చి చూచిపోతారేమో అని నాకుసిగ్గు వేస్తూవున్నది.

కర—(తనలో) నేను వీరినివిడిచి వక్కనిముషం అవతలకు వెళ్ళను. యేమిచేస్తారో చూతాము.

రామా—ప్రియురాలా! తినవేమి?

మోహి—మీరుచేసే ఆదరణ చేతనూ గౌరవంచేతనూ నాకు ఆకలికనపడడం లేదు. (అని తినుచున్నది)

కర—(తనలో) అది మిఠాయివుండలు యేలాగు మింగుతూవున్నదో దాన్ని చూస్తే నానోరు వూటలువూరుతూవున్నది.

రామా—కరటకా! ఆతమలపాకులు యిక్కడ పళ్ళెములో వుంచి యీమిఠాయివుండలు యీచిన్నదానికి అందిస్తూవుండు.

కర—(దగ్గరకువచ్చి పళ్ళెము బోర్లించుచున్నాఁడు)

రామా—ఓరినిర్భాగ్యుడా! నీకుమతిపోయినట్టువున్నదే. పళ్లెం బోర్లించినావేమి? అదితిన్నగాతీసి యీమిఠాయివుండ మోహినికందియ్యి.

కర—(పుచ్చుకొని తానేతినుచున్నాఁడు)

రామా—ఓరి నిర్భాగ్యుడా! నీకు పిచ్చియెత్తినదా యేమి? (తనలో) దీని సౌందర్యంచూస్తే వీడికీ ఆశకలుగుతూవున్నట్టున్నది. అయినా వీడిమనస్సు పరీక్షచేసి చూస్తాను. (ప్రకాశముగా) ఈమె సౌందర్యం వర్ణించడానికి శక్యమైనదికాదు.

కర— ఆరంభంలో అలాగేకనుపడుతుంది కానితరువాత—

రామా—ఆమందహాసము సొగసు చూచినావా?

కర—ఆపళ్ళు యికిలించడమా?

రామా—ఆ కళ్ళ అందము కనిపెట్టినావా?

కర— చికిలికళ్ళ-

రామా—నీవంటి గుడ్డివాళ్ళకాలాగే కనుపడతవికాని మా వంటి రసికులకు-

కర—(తనలో) ఈవ్యవహారంయింకా రెండు నిముషాలు యిలాగు జరుగుతూవుంటే నాకునిజంగానే పిచ్చిమెత్తుతుంది.

రామా—ఓ మోహినీ! నీకు ప్రియులెందరున్నారు?

మోహి—ఒక్కడే.

రామా—ఒక్కడేనా? అతడుమిక్కిలిచక్కనివాడు కాబోలును.

మోహి—ఆరంభంలో ఆలాగేకనుపడుతాడుగాని తరువాత ఏమయినాఅంటే అతడు వంటిరిగా వున్నప్పుడు నన్నుకొడతాడేమో అని భయము వేస్తూవున్నది.

రామా—అతనికి నీమీద అనుమానంకూడా వున్నదా?

మోహి—యిప్పటిస్థితిచూస్తే అదికూడావున్నట్టే కనుపడుతూవున్నది.

కర—ఇప్పుడువెళ్ళి-(అని కాలు నేలతన్నుచున్నాడు.)

రామా—అదేమిటి?

కర—ఏమీలేదు. కాలుతిమ్మిరిగా వున్నది. (తనలో) ఇక నిజంచెప్పివేస్తాను.

రామా—నక్క కాలేకాదు నీకువళ్ళంతా తిమ్మిరిగావున్నట్టున్నది.

[అప్పుడు వెంకడు పరుగెత్తుకొని వచ్చుచున్నాడు.]

వెంక—అయ్యా! అమ్మగారు వస్తూవున్నారు.

రామా—యేఅమ్మగారు రా?

మోహి— మాఅమ్మ వస్తూవున్నదా?

వెంక—యేఅమ్మ గారా? యేలినవారి భార్యాగారు. శ్యామలాంబగారు. నేను వెళుతూవుండగా అమ్మగారిబండి యెదురుగావస్తే నేను వెనక్కు పరుగెత్తుకొని వచ్చినాను.

కర—ఇక నేను బ్రతికినాను. నాకు మళ్ళీ ప్రాణాలువస్తూ వున్నవి.

రామా—మీరు యీ ఆకులూ అన్నీ తీసివెయ్యండి. వేగిరం కరటకా! నీవీదొడ్డితలుపుతీసి మోహినిని యింటికి పంపించివెయ్యి. (అని తలుపువద్దకు పరుగెత్తుకొనిపోయి) ఈపెరటితలుపు తాళము వేసియున్నది. కరటకా! తాళంచెవి యేదీ?

కర—తాళంచెవా?

రామా—అవును. తాళంచెవి వేగిరం ఇయ్యి.

కర—(దేహము తడవుకొనుచు) తాళముచెవి పోయింది.

రామా—అయ్యో! ఇప్పుడేమిచెయ్యను?నాకుఅసాధ్యం వచ్చినది. నాభార్య బండిదిగి వస్తూవున్నది. కరటకా! నీవీచిన్నదాన్ని యిప్పుడీవసారాలోకి తీసుకుని వెళ్లు. నేనుయెదురుగావెళ్ళి నాభార్యను తీసుకొనివస్తాను.

కర—మంచిది. (అని మోహినితో వసారాలోకి పోవుచున్నాఁడు.)

[అప్పుడు శ్యామలాంబ ప్రవేశింపఁగా, రామాకాంతముపంతులెదురుగాపోవుచున్నాఁడు. మోహినిని విడిచి కరటకరెడ్డి వచ్చుచున్నాఁడు.]

శ్యామ—ఓప్రాణేశ్వరా! మీకు తెలివివచ్చినదా? నేను మిమ్మల్ని చూడనేమోనని యేడుస్తూవచ్చినాను.

రామా—ఈసోదియేమిటి? నీవు ఇప్పుడు పడిపోయినట్టు వంటరిగా యెందుకు వచ్చినావు?

శ్యామ—మీరు దాచఁబోకండి. మీ కథంతా నేనువిన్నాను సుమా.

రామా—(తనలో) మోహినిమాట యెవరూ చెప్పలేదుగద. (ప్రకాశముగా) కథంతా విన్నావా? ఏకథవిన్నావు?

శ్యామ—తాచుపాముకాటు బ్రతికినా చచ్చినా నాలుగు ఝాములలో తెలుస్తుంది. నాకు భూమిలో పసుపు కుంకుమా పెట్టుకొని అయిదోతనం చెయ్యవలసినయోగంవున్నదిగనుక నాపుణ్యం చేత మీరు సజీవులయి తేరుకున్నారు. మీరు చెప్పకపోయినా నాకు యీవుత్తరంచెప్పినది. (అని వుత్తరం చేతికిచ్చుచున్నది.)

రామా—(ఉత్తరము పుచ్చుకొని చదువుచు) ఎవడురా యీ వుత్తరంవ్రాసినదుర్మార్గుడు? నాకు రాత్రితోటలో తాచుపాము కరిచిందట! నేను స్పృహ తెలియకుండా పడివున్నానట! నేను బ్రతుకుతానో లేదో తెలియదట! దీనికింద దస్కతు లేదు. కరటకా! యీ దస్తూరీయెవరిదో నీవు చెప్పగలవా! (అని చూపుచున్నాఁడు.)

కర—యీదస్తూరీ నాకుయెంతమాత్రము తెలియదు. ఇది కొత్తవ్రాత. (తనలో) తన పెళ్ళాముతో యీయన తిరగడానికి వేగ లేక గుమాస్తా భీమారావూ నేనూ కలిసివ్రాసినవుత్తరం వూరికేపోలేదు. తగినపని చేసింది.

శ్యామ—అది దొంగవుత్తరమయినందుకు నాకు సంతోషంగా వున్నది. మీ కేమీతొందర కలుగ లేదుగదా?

కర—పాముకాటు మహాచెడ్డది. దానివల్ల యెంత అపాయమయినా వున్నది. ఈయన యెప్పుడూ భార్యనువిడిచి వంటిగా వుండకూడదు.

శ్యామ—నీవు కూడావున్నతరువాత భార్యలేనిలోపం వుండదు. ఇటువంటిది ముందు యెప్పుడయినా మళ్ళీతటస్థిస్తే నాకు ముందుగా వర్తమానము పంపుమా.

కర—తప్పకుండా పంపుతాను. ఇక నాలుగురోజులకు తటస్థమవుతుందనగానే మనిషినిపంపుతాను.

రామా—అయినదానికి విచారించిన కార్యములేదు. మనము లోపలకు వెళుదాము రా. (కరకటరెడ్డితో రహస్యంగా) మేము వెళ్ళగానే మోహినిని అవతలికి పంపివెయ్యి.

శ్యామ—నాకు చెమటపట్టింది. లోపలికిరాను. కొంచెము సేపు చల్లగాలికి యీవసారాలో మల్లిపందిరిదగ్గిర కూర్చుంటాను. నామల్లిచెట్టుకు రోజూనీళ్ళుపోయిస్తూవున్నారా?

రామా—వసారాలోకా?

శ్యామ—వసారాలోకే వెళుతాను.

రామా—(కరటకరెడ్డితో రహస్యంగా) నీవేదో మారుపాయం కల్పించి బొంకవలెను. తక్షణం యేదో అబద్ధంకల్పించి నామానందక్కించు.

కర—అమ్మా! వసారాలో యెవరున్నారో మీకు తెలియదు. నన్ను క్షమించవలెను.

శ్యామ—వసారాలోయెవరున్నారు? నిన్ను క్షమించడానికి యేంనేరంచేసినావు?

కర—ఒక చక్కనిచిన్నదాన్ని నేను తీసుకొనివచ్చి—

రామా—(తనలో) వీడునాగుట్టు బయలపెడుతూవున్నాడు—

శ్యామ—ఏమీ! నేనులేనిసమయంలో నాయింటికిఆడదాన్ని తెచ్చినావా?

రామా—(కోపముతో) చక్కనిచిన్నదాన్నా? కానీ చెప్పు చెప్పు.

కర—నేను చెప్పేది చివరదాకా వినండి. నాకు చెప్పడానికి సిగ్గు వేస్తూవున్నది. మీయిద్దరికీ కోపం తెప్పించడానికి కారణమయిన ఆనిర్దోషురాలు నాపెళ్ళాము.

రామా—నీభార్యా?

శ్యామ—నీ పెళ్ళామా?

కర—అవును నాపెళ్ళామే. పంతులుగారు మీనిమిత్తమయి మంచిదాసీని కుదుర్చుమని నాతో చెపితే నాపెళ్ళాము పెద్దమనిషీ వళ్ళువంచి పనిచేసేదీ అని తీసుకుని వచ్చినాను. అమ్మగారుకొన్నాళ్లు చూచి తమ మనసువచ్చినట్టు పనిచేసేదనితో స్తే జీతంనిర్ణయించి భార్యాభర్తల నిద్దరినీ పోషించేభారమే మీది.

రామా—(తనలో) వీడు బహుబాగాబొంకినాడు. ఇందులో వీడుచెప్పినది వక్కక్షరమయినా నిజంకాదనడానికి లేశమయినా అవకాశము లేదు.

శ్యామ—నాకోసము శ్రమపుచ్చుకొని మీరు దాసీ నిమిత్తమయి యింతప్రయత్నంచేసినందుకు నాకు సంతోషంగావున్నది. కరటకా! యేదీ నీభార్యను నాకు చూపించు.

కర—రండివెళ్ళిచూతాము. (కరటకరెడ్డియు శ్యామలాంబయు పోవుచున్నారు.)

రామా—ఔరా! రెడ్డీ! యెంతచక్కగా బొంకినావురా? నాకదివరకు నిజం తెలిసివుండక పోయినట్లయితే చెప్పినదంతా నేనూ నమ్మును. వీడు నిముషంలో ఆకొత్తదాన్ని పెళ్ళాముగా మార్చి వేసినాడు. యెలాగయినా యీ అపూర్వవివాహంవల్ల మాదంపతులకు కలహం తప్పిపోయింది. నేటికి నేను బ్రతికినాను.

(శ్యామలాంబ ప్రవేశించుచున్నది.)

శ్యామ—నేను మనరెడ్డిపెళ్ళామును చూచినాను. దానివద్ద వినయమూ తెలివీ కావలసినంత వున్నవి. అది శూద్రదయినా

యెంతో చక్కగా మాటాడినది. దానికపటంలేని మాటలువింటే నాకు బహుసంతోషమయినది.

రామా—అది నీమనసుకు నచ్చినదిగద?

శ్యామ—చివరకు నాకుమంచిదాసీ దొరికింది. మనరెడ్డి దానిమీఁద ప్రాణములు విడుస్తూవున్నాఁడు. మొగుడూ పెళ్ళామూ యిద్దరూ మనయిల్లు కనిపెట్టుకువుంటారు. వాళ్ళ అనురాగమూ ఐకమత్యమూ చూస్తే నాకు ముచ్చటవుతూవున్నది.

రామా—(తనలో) వాడు యెంతసేపటికీ కదలిరాకుండా వున్నాడు. దొడ్లో దానితో యేమిచేస్తూవున్నాఁడు?

శ్యామ—యీ అద్దంలో వాళ్ళు కనపడుతూవున్నారు. మన రెడ్డిపెళ్లామును యెలాముద్దుపెట్టుకుంటూవున్నాడో!

రామా—పట్టపగలు ఆడదాన్ని వాడలాచెయ్యడం నీకు యిష్టముగావున్నదా?

శ్యామ—మొగుడు పెళ్లామును ముద్దుపెట్టుకుంటే అందులో తప్పేంవున్నది?

రామా—తప్పితం లేదుగాని నేను వక్కమాటు కరటక రెడ్డిని కూకలు వెయ్యవలెను. నీవవతలకుపో.

శ్యామ—పెళ్ళమును ముద్దుపెట్టుకొన్నందుకు కాదుగద?

రామా—అందుకోసము కాదు. మరొకందుకు కూకలు వేస్తాను.

శ్యామ—అలాగైతే నేను లోపలికిపోయి వాళ్ళుకాపురం వుండడానికి దంపుళ్ళగదిచోటుచేయించివస్తాను. (అని వెళ్లుచున్నది.)

(అప్పుడు కరటకరెడ్డి ప్రవేశించుచున్నాఁడు.)

రామా—అప్పుడే మీరు రావడానికి తీరుబడిఅయిందీ? యింత వేగిరం దయచేశారేమి?

కర—(శ్యామలాంబకు వినఁబడునట్లు బిగ్గరగా) క్షమించండి నాభార్యతో—

రామా—(మెల్లగా) నీభార్యా?

కర—అవును నాభార్యా. అమ్మగారుదాన్ని తమపనికత్తెగా వుంచుకోవడానికి వప్పుకున్నారుగనుక, ఆమెవద్ద యేలాగునడుచుకోవలెనో దానికి బుద్ధిచెపుతూవున్నాను. మీరు యెరుగుదురు గదాండి—

రామా—నీవు వట్టి ఝూటాకోరువని నేను యెరుగఁదును. ఇలాగంటి పనులు చెయ్యకుండా నిన్నుగుర్రపుకొరడాతో వీపుబద్దలు కొట్టవలెను.

కర—ఈపరియాచకం బాగా నేవున్నది.

రామా—బాగా నేవుంటుంది. తెలివితక్కువదాన్ని చేసి నీవా చిన్నదాన్ని చెరపడానికి చూస్తూవున్నావు. మాయింట్లో యిటువంటి నీతిమాలినపనులు యెంతమాత్రమూ పనికిరావు.

కర—దైవముతోడు! నిజముగా అది—

రామా—నావద్ద నీఅబద్ధపు ప్రమాణాలూ గిమాణాలూ సాగవు. నీవాచిన్నదాన్ని యెందుకు ముద్దుపెట్టుకున్నావో చెప్పు.

కర—(తనలో) యెవరూ లేనప్పుడు నేను రహస్యంగా ముద్దుపెట్టుకున్న సంగతి యితనితో యెవరుచెప్పినారో. ఓయి దేవుడా! ఇక్కడ గోడలకుకూడా చెవులు వున్నవికదా?

రామా—నీవుమళ్లీ యేదో పెద్దఅబద్ధమాడడాని కాలోచిస్తూవున్నావు. నీమాటలకు నేను మోసపోను.

కర—నేను అబద్ధం యెంతమాత్రమూ ఆడను. నిజంగా నేను మోహినిని ముద్దుపెట్టుకున్నాను. మీరు నమ్మినాసరే నమ్మకపోయినాసరే నిజంచెప్పినాను.

రామా—యెందుకు పెట్టుకున్నావు?

కర—మీకోసమే ముద్దుపెట్టుకున్నాను. అమ్మగారి మనస్సులో మీయందుండే అనుమానంపోగొట్టడానికి నేనాపనిచేసినాను. నేనుచేసినపని మీక్షేమంనిమిత్తమే కాని నానిమిత్తంకాదు. సేవకులు యజమానుల నిమిత్తమయి యెంతపనిచేసినా వారికి మెప్పు కనుపడదు.

రామా—ఆముద్దు నాకోసం కాకుండ నీకోసమే పెట్టుకున్నావని నాకుయిప్పటికీ అనుమానము బాధిస్తూనేవున్నది. అదుగో మోహిని యిలాగేవస్తూవున్నది. నేను లోపలికిపోయి యీతలుపు కంతలోనుంచి మీయిద్దరిచర్యలూ కనిపెడుతూవుంటాను. నీవునన్ను మోసంచెయ్యలేవు.

కర—అయ్యా! మోహిని వకవేళవచ్చి మోహించి నన్ను యేమయినాచేస్తే, అదీ నాతప్పితమేనా? ఆడవాళ్ళువచ్చి యెదుట నిలవబడ్డప్పుడు మగవాళ్ళు మనసుపట్టలేరు. మీవిషయంలోనాశాయశక్తులా పనిచేస్తానుగాని వకవేళ ఆచిన్నది తనంతటవచ్చి నన్ను—

రామా—దానికి ఫర్వాలేదు. నీవుమాత్రం మళ్ళీయెప్పుడూ ముద్దుపెట్టుకోకూడదు. యీసారి నీవు మళ్ళీముద్దుపెట్టుకున్నట్టయితే నిన్నుగుర్రపుకొరడాతో చావగొట్టి మాయింట్లోనుంచి సాగనంపుతాను. (అని లోపలికిపోయి తొంగిచూచుచున్నాడు.)

[మోహిని ప్రవేశించుచున్నది.]

మోహి—ఆమె బహుదొడ్డయిల్లాలు. యికమనరహస్యం మానివేసి మనంయిక్కడ సుఖంగావుండవచ్చును.

కర—మెల్లిగామాట్లాడు! మెల్లిగా. (తనలో) ఇదియెంత సౌంజ్ఞచేసి చెప్పినా మెల్లిగా మాట్లాడకుండావున్నది. నేనుజవాబు చెపితే నాపనిపోతుంది. చెప్పకుండావుంటే పెళ్ళాముపోతుంది. నాకంతా అసాధ్యంగానేవున్నది.

మోహి—నీవునా మొగుడవని నేనిప్పుడందరితోనూ చెప్ప వచ్చును.

కర—(నవ్వుచు) నీమొగుడా! ఈహాస్యం కొంచెంసేపు చాలించు. అదియెల్లప్పుడూ పనికిరాదు.

మోహి—నీవునాకు మొగుడవడం హాస్యమా? ఇన్నాళ్ళ నుంచీ మనం మొగుడూపెళ్లామూ కావడమంతా యిప్పుడు హాస్య మయిపోయిందీ? (అనిమొగమునకు కొంగడ్డముపెట్టుకొని యేడ్చుచు) మంచిది యిప్పుడు నీవునన్నువిడిచిపెడితే నాకుమొగుళ్ళు దొరక్క పోరులే. నాకు యిలాగంటిమొగుళ్ళు లక్షమంది దొరుకుతారు. నీవు వదిలిపెడితే రేపుయీపాటికి నేను విధవావివాహం చేసుకుంటాను చూడు.

కర—(తనలో) నేనుయిప్పుడు దీన్నిసముదాయించక పోయి నట్టయితే కార్యంచెడుతుంది. (తనయజమానుఁడాగదిలోనున్నాఁ డని సైగచేయుచు మెల్లగా) నేను నీపెనిమిటినే. అందుకు సందే హములేదు. కాని నాయజమానుడు—నేను స్వతంత్రుణ్ణిఅయితే— క్షమించు తెలిసిందా?

మోహి—నాకుతిన్నగా తెలిసిందికాదు కాని వక్కముద్దు పెట్టు క్షమిస్తాను.

కర—(తలుపుకేసిచూచి తనలో) నేను చొరవచేసి వక్క ముద్దుపెట్టుకుంటాను.

మోహి—యేమి యింకాముద్దుపెట్టుకోవడానికే అనుమా నిస్తూవున్నావేమి? పోనీ! నేను యిప్పుడుపోయి నీదుర్మార్గమంతా అమ్మగారితో మనవిచేస్తాను.

కర—ఓభగవంతుడా!

మోహి—నేనుపంతులుగారితోకూడా చెప్పతాను. ఆయన బహుకోద్దవాడు. నీవలె నన్నాయన అనాదారణచెయ్యడు;

[శ్యామలాంబ ప్రవేశించుచున్నది.]

శ్యామ—ఏమిటి? మీ లో మీ ర ప్పు డే తగువులాడుతూ వున్నారా?

కర—అమ్మా! తప్పితండానిదికాని నాది కాదు.

మోహి—అమ్మా! తప్పితమంతా ఇతనిదే. నేను తనకు ముద్దియ్యబోతే వుచ్చుకున్నాఁడుకాఁడు.

శ్యామ—యేమిటి? పెళ్ళాముప్రేమతో ముద్దుయిస్తే, పుచ్చుకున్నావుకావా? ఏదీ యిప్పుడు నాయెదుట ముద్దుపెట్టుకో.

కర—(తలుపుకేసి చూచి) యికనాతప్పితంలేదు. (అని ముద్దుపెట్టుకొని) మోహినీ! జరిగిపోయినది మరిచిపో. యిక నేను నీవుచెప్పినట్టు వింటాను.

రామా—(తలుపు తీసికొనివచ్చి కోపముతో) నేను యింత దూరము చెప్పినా నిర్భయంగా నీవుమళ్ళీ ముద్దుపెట్టుకున్నావుగా!

మోహి—అయ్యా! నాపెనిమిటిమీద కోపపడకండి.

రామా—(తనలో) పెనిమిటా? ఇదికూడా హాస్యానికన్న మాటే నిజంచేస్తూవున్నదే. (ప్రకాశముగా) నేను యిప్పుడు వీడి పని తీసివేస్తాను.

శ్యామ—మీరు నిష్కారణంగా పనితీసివెయ్యకూడదు.

రామా—నిష్కారణంగా కాదు. కావలసినంత కారణం వున్నది. ఆ కారణమేమో రెడ్డికే తెలుసును.

కర—నాకా? నాకుయేకారణమూ తెలియదు.

రామా—నీకు కారణమేమీ తెలియదుగా?

శ్యామ—రెడ్డీ! నీవు మారుమాటయేమీ చెప్పవద్దు. మీ దంపతులు యిద్దరూ దంపుళ్ళగదిలోకిపొండి. నేను తరువాత ఈయనను సమాధానం చేస్తాను.

మోహి—రెడ్డీ! వెళుదాముర్రా.

శ్యామ—మీరుసిజముగానే వీళ్ళను పంపించివేస్తారా?

రామా—నేనుకాదు నీవేపంపించివేస్తావు. నిజంచెప్పవలసినట్టయితే వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలుకారు.

శ్యామ—కారా?

రామా—కారు.

మోహి—(ముగసితో) మనకువివాహమయిన సంగతియీయనకు తెలియనేలేదా?

కర—వూరుకో.

శ్యామ—నాకీమాయ తెలియకుండావున్నది. వాళ్ళిద్దరూ కూడా మహామంచి వాళ్ళుగా కనపడుతూవున్నారే.

రామా—పయికి మంచివాళ్ళుగానే కనపడుతూ వున్నారు. వాళ్ళునిజంగా భార్యా భర్తలయితే వాళ్ళను వెళ్ళగొట్టడానికి నాకు మాత్రం యిష్టంవుంటుందా?

కర—మేము పెళ్ళిచేసుకున్న మొగుడూ పెళ్ళాలమయిన మాట నిజమయినట్టయితే మమ్మలిని వెళ్ళగొట్టడం మీకుయిష్టం లేదుగద? అలాగయితే దీనినిజమంతా ఆవచ్చే శాస్త్రుల్లుగారు చెపుతారు. అయనను అడగండి.

[అప్పుడు సోమభట్లు ప్రవేశించుచున్నాడు]

రామా—అయ్యా సోమభట్లుగారూ! నమస్కారము. మీరు యేంపనిమీద వచ్చినారు?

సోమ—ఈరోజున మీతండ్రిగారి తిథిప్రయోజనము. నిన్నటిరాత్రినుంచీ మీకోసం తిరుగుతూవుంటే మీదర్శన మయిందికాదు. వుదయమయిన తరువాత నాలుగు మాట్లుయిక్కడకు వచ్చినాను. మీరు పంటిఘంటవరకూ యింటికేరాలేదు.

రామా—అవును మా ఆడబాళ్లు వూళ్లో లేకపోవడంచేత మా బంధువులయింట్లో భోజనంచేసినాను. మీరుయీసంగతి యెక్కడా చెప్పబోకండి. అంతగా కావలిస్తే తద్దినం రేపువుదయాన్న పెడుదాము.

సోమ—చిత్తము. అలాగే కానిత్తాము. నాకు నాలుగురోజులలో తూర్పువెళ్ళవలసిన పనివున్నది. వెళ్ళితే నాలుగునెలలదాకా రానండి. ఈలోగా తమలోపలవచ్చే కార్యాలు మరీయేమీలేవు.

శ్యామ—ఏమయ్యా బ్రాహ్మడా! నీకు వూరికివెళ్ళవలసిన పనివున్నదని యింత కక్కూర్తిపడుతావు? మామామగారుపోయింది వైశాఖమాసమయితే యీచైత్రమాసంలో తద్దినం యెలాగువస్తుందయ్యా?

సోమ—అమ్మగారూ! కోపంపడకండి. నేనుపంచాంగం పొరపాటుగా చూచినాను కాబోలును. మళ్ళీవెళ్ళి తద్దినాలజాబితా తిన్నగా చూచివస్తాను. (అనిపోబోవుచున్నాడు.)

కర—(ఆపి) అయ్యా! మీరుమాయిద్దరికీ పెళ్ళిచేయించిన సంగతి యీయనతో వక్కసారి చెప్పిమరీపొండి.

సోమ—అవును అందులో యేమితగాదావున్నది? నేనుమంత్రాలు తిన్నగా చెప్పలేదని యెవరయినా ఆక్షేపణ చేసినాగాని యేమిటి? శూద్రపెళ్ళి పురాణోక్తం గనుక మంత్రాలక్కరలేదు.

రామా—వీళ్ళకు మీరు పెళ్లియెప్పుడుచేయించినారు?

సోమ—రెండుసంవత్సరాలకిందట చేయించినాను.

రామా—కరటకా! నీవు రెండుసంవత్సరాలనుండి గృహస్థువైవుండిన్నీ నావద్ద బ్రహ్మచారివిగానే నటించినావా?

కర—నేనువూరికే బ్రహ్మచారిగా నటించడంమాత్రమే కాని నిజానికి సంసార సుఖాలన్నీ అనుభవిస్తూనే వున్నాను. లోకంలో

అనేకులు పేరుకు గృహస్థులమని నటిస్తూవున్నా మీదయవల్ల సంసార సుఖంలేకుండా నిజమయిన బ్రహ్మచారులుగానే వున్నారు. ఆసంగతి దేవరవారికే విశదము.

రామా—ఆసంగతి నీవుచెప్పనక్కరలేదు. నీవుదీన్ని పెళ్లాడినమాట నిజమేనా!

కర—నిజమే. ముమ్మాటికీ నిజమే.

రామా—అన్నీ అబద్ధాలాడేవాడవు. నీవుయిందులోమాత్రం నిజంచెప్పివుంటావా?

కర—యీవేళనేను నిజంచెప్పడానికి ఆరంభంచేసినాను. దేవరవారు నేను యికగృహస్థ బ్రహ్మచారినిగా వుండవలసిన ఆవశ్యకంలేకుండాచేస్తే నేను నేటినుంచి సత్యహరిశ్చంద్రుణ్ని అవుతాను.

రామా—కరటకా! ఇందాకటి నీఅవస్థతలుచుకుంటే నాకు నవ్వువస్తూవున్నది. ఇప్పుడు జరిగినదంతా మరిచిపోయి మీరు యిద్దరూ యికమీయింట్లో సుఖముగా వుండవచ్చును. నేను యిక ముందు నీవుచెప్పిన గృహస్థబ్రహ్మచారులను నిజమైన గృహస్థులనుగా చెయ్యడానికే ప్రయత్నంచేస్తాను. లోపలికిపోదాముర౦డి.

కర—అలాగయితే మాకు యిదివరకు జరిగినవివాహం వివాహంకాదు. ఇప్పుడు మీరు జరిగించినదే వివాహము. నాబ్రహ్మచర్యంవదలి మీదయవల్ల నేను యిప్పుడు నిజమయిన గృహస్థునవుతూవున్నాను.

[అందరు నిష్క్రమించుచున్నారు.]

బాను ప్రెస్, రాజమండ్రి-1950

కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములు

స్త్రీలకుపయోగించు కథలు

అయిదవ సంపుటము

1 సత్యవతీ చరిత్ర
2 చంద్రమతీ చరిత్ర
3 సత్యసంజీవిని
4 చమత్కార రత్నావళి
5 సతీమణి విజయము
6 సుమిత్ర చరిత్రము
7 రఘు దేవరాజీయము
8 శారంగేశ్వరవర్తక చరిత్రము
9 కళావతి పరిణయము
10 గయ్యాళిని సాధుచేయుట
11 చిత్రకేతు చరిత్రము
12 దానకేసరీ విలాసము
13 వైదర్భీ విలాసము
14 భానుమతీ కళ్యాణము
15 సరసిజనమనోభరామము
16 ధర్మకవచోపాఖ్యానము
17 కుమారద్వయ విలాసము
18 పద్మనీప్రభాకరము
19 మాలతీమధుకరము

స్త్రీలకుపయోగించు పుస్తకములు

ఆఱవ సంపుటము

1 శ్రీవిక్టోరియామహారాజ్ఞి చరిత్ర
2 సతీహితబోధిని
3 పత్నీహితసూచని
4 స్త్రీ నీతిదీపిక
5 సత్యాద్రౌపదీ సంవాదము
6 మాతృపూజ పితృపూజ
7 నీతికథామంజరి ప్ర॥ భాగము
8 డిటో ద్వి॥ భాగము
9 దేహారోగ్యధర్మబోధిని

ఉపన్యాసములు.

ఏడవ సంపుటము

1 జన్మాంతరము
2 అతిబాల్యవివాహము
3 విగ్రహారాధనము
4 ఈశ్వరదత్తపుస్తకములు
5 ఈశ్వరోపాసనము
6 ప్రార్థన
7 మానుషధర్మము
8 విద్యార్థికుల ధర్మములు
9 మనుష్యజీవితములయొక్క పరమార్థము
10 వైరాగ్యము
11 విద్యాధురీణులయర్హకృత్యంబు
12 వర్ణము
13 హిందూమతములు
14 స్వయంకృషి
15 సకాయకష్టకర్మలు
16 వేశ్యాకాంతల యుప॥
17 ఐకమత్యము
18 దానములు
19 స్త్రీ పునర్వివాహ చరిత్రం...
20 స్త్రీ పునర్వివాహ విషయకోపన్యాసం
21 స్త్రీ పునర్వివాహ విషయక ప్రథమవిజ్ఞాపనము

కీ॥ శే॥ కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములు

22 స్త్రీ పునర్వివాహ వి॥ ద్వి॥,,
23 స్త్రీ పునర్వివాహశాస్త్రసం॥
24 స్త్రీ పునర్వివాహ భూతవర్త మానస్థితులు

ఉపన్యాసములు-జీవితచరిత్రలు.

ఎనిమిదవ సంపుటము

1 దేశీయమహాసభ దానియుద్దేశము
2 శంకరాచార్యులు
3 బసవరాజు గవర్రాజుగారి జీవచరిత్రము
4 జీసస్ చరిత్రము
5 స్వదేశసంస్థాన చరిత్రాదులు
6 విగ్రహతంత్రవిమర్శనము
7 ఉపన్యాసమంజరి
8 వివేకవర్ధని మొదటిభాగము
9 ,, రెండవభాగము
10 ,, మూడవభాగము

సాహిత్య గ్రంథములు

తొమ్మిదవ సంపుటము

1 సంగ్రహవ్యాకరణము
2 కావ్యసంగ్రహము
3 అలంకారసంగ్రహము
4 నీతిచంద్రిక విగ్రహము
5 నీతిచంద్రిక సంధి
6 తర్కసంగ్రహము
7 సత్యవాదిని
8 ఉత్తమస్త్రీ చరిత్రములు

ఆంధ్రకవుల చరిత్ర.

పదియవ సంపుటము

పూర్వకాలపు కవులు 1 వ భా॥
మధ్యకాలపు కవులు 2 వ భా॥
ఆధునిక కవులు 3వ భా॥

స్వీయ చరిత్రలు.

పదకొండవ సంపుటము

1, 2 భాగములు కలసి

N. B. పై గ్రంథములన్నియు వాల్యూములుగాను, విడిగాను, కూడ దొరకును.

పుస్తకములు వలయువారు:—

కార్యదర్శి. హితకారిణీ సమాజము.
రాజమహేంద్రవరము

అని వ్రాసిన బడయుగలరు.